## ప్రియా, ప్రియా, మధురం!

ఆ పాటంటే నా కిష్టం. అంచేత తోచినప్పుడూ తోచనప్పుడూ కూడా పాడుకుంటాను. అయితే ఈ మధ్య అందరూ పాడేస్తున్నారు.

వాళ్ళ అర్థం వేరు ప్రియాతి ప్రియమైన స్కూటర్ "ప్రియ" కోసం, ఆ పాట. అది తెలుసుకుని నా అర్థమూ మార్చుకున్నాను. రూపాయిపెట్టి అప్లికేషన్ కొనాలి.

అయిదువందల రూపాయలు పోస్టాఫీస్ సేవింగ్స్ బ్యాంక్‌లో కంపెనీ వారికి చెల్లించడాని కిష్టపడుతూ జమకట్టాలి.

అయిదు రూపాయల స్టాంపు పేపర్‌మీద హామీపత్రం రాయాలి.

అన్నీ రిజిస్టర్డ్ పోస్ట్ అకనాలెడ్జిమెంట్ డ్యూతో సదరు కంపెనీకి ఫలానా తేదీలోగా చేరేటట్టు పంపాలి.

అప్పుడు లాటరీ తీస్తారు.

"నాకే ఎందుకు రాకూడదు?" అనుకున్నాను. "ముప్ఫయ్యార

చీట్లు తీస్తారు. ఒక్కటీ నాకు రాకుండా పోతుందా !" అని కూడా అను కున్నాను.

అరగంట పర్మిషన్ పెట్టి అప్లికేషన్ కొందామని వెళ్ళాను. అక్కడ ప్రియాభిలాషుల క్యూలో నాలుగువేల జనం వుంటే ఆ ప్రియ మైన దృశ్యానికి మనసు పరవశించింది.

సాయంకాలం నాలుగైంది; బైటపడేసరికి అప్లికేషన్ రూపా యికే ఇచ్చారు. క్యూలో నుంచున్నప్పుడు రెండు రూపాయల సిగరెట్లు కాల్చేస్తేనూ; రోడ్డుమీద టీ కొట్టు కుర్రాడు అడపా తడపా తెచ్చిన టీలూ, గారెలు రెండు రూపాయలైతేనూ అదో లెక్కా ?

500 ల అప్పుకోసం 50 మందిని అడిగాను. ఆశ్చర్యం! అందరూ నన్నే అడుగుదామనుకొన్నారుట, మా కెంత ప్రియమైన సంగతి.

పోస్టాఫీసు కెళ్ళాను. "పాస్ బుక్కులు అయిపోయాయి, హైదరాబాద్‌కి రాశాం" అన్నారు. గుండె నీరైంది 'ఫర్లేదులెండి' పోస్టాఫీసు వుద్యోగుల్లో సహంమంది ప్రియాన్వేషకులే. డిపార్ట్ మెంటల్ టెలిగ్రామ్స్ ఇచ్చేరు అని ఎవరో ప్రియవచనం చెప్పారు.

రిజిష్ట్రార్ ఆఫీసు కెళ్ళాను. స్టాంపు పేపరుకోసం. "అయిదు రూపాయలవి లేవు" అన్నారు. 'పోనీ-ఆరుల' అన్నాను. "యాభై రూపాయల లోపు కాగితంలేదు" 'అనకాపల్లిలో__?' అని అడిగాను. 'కాకినాడ వరకు లేవు రాజమండ్రిలో ప్రయత్నించండి.'

అవును. రాజమండ్రిలో 'ప్రియ' మిత్రుడున్నాడు; సాహెబు గారు ట్రంకాల్ చేశాను. "బాబూ, నా బండి ఇచ్చేస్తాను ఈ వెర్రిలో పడకు" అని జవాబు !

అలాంటి ఆ ప్రియమైన వాతావరణంలో ఆశ చిగిర్చింది ప్రియానుగ్రహంవల్ల ! 'అయిదు రూపాయల స్టాంపు పేపరు దొర

కనిచో, అదే విలువ గల అడిశివ్ స్టాంపుతో సరిపెట్టుకోబడును !'
అని ఆటోమేటిక్‌గా ప్రకటన....

ఆ విధంగా 'ప్రియా' ప్రియుల జాబితాలో చేరాను.

ఎన్నండీ అప్లికేషన్లు ?

అమ్మినవి లక్ష అరవై వేలు ! చేరినవి ఎనభై వేలు !!

"అబ్బా ! ఇరవై రోజుల్లో లక్ష అరవై వేలు కూర్చుని సంపాదించారన్నమాట" అన్నాను.

"అదికాదండీ బాబూ, నాలుగుకోట్ల రూపాయలు పోస్టాఫీసులో డిపాజిట్ అయ్యాయి" అన్నారెవరో, పక్కనించి.

పేదదేశం మనది, లేకపోతేనా ? అనుకున్నాను.

ఎనభై వేల స్కూటర్లు ! ఎంత పెట్రోలు ! మరెంత పార్కింగ్ స్పేస్ ! ఎవరూ భూమ్మీద నడవరు ఇంక ! అని పరవశం చెందాను.

"ఇందులో నలభై వేల మందికి యిప్పటికే స్కూటర్లు, కార్లు, ఆ మాటకొస్తే లారీలు వున్నాయి సుమండి" అన్నారు ఒకరు.

"అవును, వాళ్ళంతా ఈ బండ్లు రాగానే తమ ప్రియ మిత్రులకి అమ్మేస్తారు. రెట్టింపు లాభం వేసుకుని ?" అన్నారు ఇంకొకరు.

"ప్రియంగా అన్నమాట" అని మరొకరు చమత్కరించారు.

"నెలకి ముప్ఫయ్యార్రు చొప్పున ఎనభై వేల మందికి స్కూటర్లు సరఫరా చెయ్యడానికి ఎన్నాళ్లు పడుతుంది లెక్కకట్టు !" అన్నాను ప్రియపుత్రుడితో. నాకు లెక్కలంటే భయం; చెప్పాగా !

"నూట ఎనభై అయిదేళ్లు నాన్నా ?" అన్నాడు వాడు.

నాకేం ! నాకు మొదటినెల లాటరీలోనే వచ్చేస్తుందిగా-

"ప్రియా, ప్రియా మధురం !" అని పాడుకుంటూ నెప్పట్లాగా-

(5-5-79)